క్లుప్తంగా

రేపు క్రికెట్ పోటీలు

పొదిలి రూరల్: పొదిలి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 31వ తేదీన ఇగ్నైట్ యంగ్ మైండ్స్ అధ్వర్యంలో నియోజక వర్గ స్థాయి క్రికెట్, గ్రూపు డిస్కషన్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొంటారన్నారు. ముఖ్య అతిథిగా మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి హాజరవుతారని చెప్పారు.

శివాలయంలో మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న ప్రహరీ

పొదిలి రూరల్: మహాశివరాత్రి సందర్భంగా జరిగే బ్రహ్మోత్సవాలకు ఇప్పటి నుంచే ఆలయాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. పొదిలి పురాతన దేవాలయం పార్వతీ సమేత నిర్మమహేశ్వర ఆలయానికి మరమ్మతులు చేస్తున్నారు. ఆలయానికి దక్షిణం వైపు ఉన్న ప్రహరీ పడిపోవడంతో పునఃనిర్మిస్తున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా వెలుపలికి వెళ్లేందుకు పెద్ద గేటు అమర్చుతున్నారు. భూమికి వేసిన నాప రాళ్లు పగిలి పోవడంతో ఫ్లోరింగ్ చేయిస్తున్నారు. తిరునాళ్ల సందర్భంగా భక్తుల తాకిడిని తట్టుకొనేందుకు, వీఐపీల దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

ఏడుగురు జూదరుల అరెస్టు



పోలీసుల అదుపులో ఉన్న జూదరులు

హనుమంతునిపాడు: మండలంలోని రామాయపల్లి గ్రామ పొలాల్లో ఆదివారం కోడిపందేల స్థావరంపై ఎస్సై కృష్ణపావని సిబ్బందితో మెరుపుదాడులు నిర్వహించారు. దాడిలో ఏడుగురు జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 2 కోళ్లు, రూ.10,260 నగదు స్వాధీనం చేసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ

సీఎస్‌పురం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం గోపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో అభిషేకం, అర్చన, గో పూజ, మహా నివేదన, పల్లకీసేవ తదితర పూజలు చేశారు. మహా నివేదన పూజలలో భాగంగా భక్తులు పొంగళ్లు చేతబూని స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పూజారి సత్యనారాయణశర్మ ఆలయంలో పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి భక్తులకు వసతి సౌకర్యాలు సమకూర్చారు. భక్తులకు అన్నదానం చేశారు.

వైభవంగా పోలేరమ్మకు పొంగళ్లు



పోలేరమ్మ ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

సీఎస్‌పురం: మండలంలోని జంగంవారిపల్లిలో పోలేరమ్మ పొంగళ్ల కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. జంగంవారిపల్లిలో పట్టాభిరామచంద్ర స్వామి తృతీయ వార్షిక వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఆదివారం పోలేరమ్మకు పొంగళ్లు చేపట్టారు. పూసల బండి కట్టి మహిళలు పొంగళ్ల సామగ్రితో ఊరేగింపుగా పోలేరమ్మ ఆలయం వద్దకు చేరారు. అక్కడ పొంగళ్లు తయారు చేసి, పోలేరమ్మకు ప్రత్యేక పూజలు చేసి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కోతలు..నూర్పిళ్లతో రైతులు బిజీబిజీ



గింజలు తూర్పార పడుతున్న రైతులు



ధాన్యం కాటా వేస్తున్న కూలీలు

● పల్లెల్లో కూలీలకు పెరిగిన డిమాండ్

కొనకనమిట్ల: ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఖరీఫ్, రబీలో సాగు చేసిన పలు రకాల పంటలు కోతకు రావడంతో రైతులు పంట కోతలు కోయిస్తున్నారు. ముఖ్యంగా పశ్చిమ ప్రాంతంతలో మినుము, బొబ్బర్లు (అలసంద), మిర్చి, వరి కోతలు ఒక్కసారిగా దిగుబడి రావడంతో కోతలు కోసే పనిలో రైతులు, రైతు కూలీలు బిజీబిజీగా ఉన్నారు. స్థానికంగా కూలీలకు డిమాండ్ పెరగటంతో పక్క మండలాల నుంచి కూలీలను ఆటోలు, ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ఈ ఏడాది పంటలు సాగు చేసిన తర్వాత వర్షాలు మధ్యలో కొంత ఇబ్బంది పెట్టినా పంట దిగుబడి ఓ రకంగా వచ్చింది. మినుము, అలసంద, కంది పంటలు రైతులు ఆశించిన స్థాయిలో దిగుబడులు వచ్చే అవకాశం లేదని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు.

కళ్లాల్లో పంట నూర్పిళ్లు

ఓ పక్క పంట కోతలు కోస్తూనే పంట నూర్పిడిని కళ్లాల్లో చేస్తున్నారు. పంట కోతలకు కూలీలు దొరక్క పొదిలి, హనుమంతునిపాడు, బేస్తవారిపేట, దొనకొండ, తర్లుపాడు మండలాల నుంచి కూలీలను ఆటోలు, ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. ఈ ఏడాది కూలీ రేట్లు పెరిగాయి. రూ.400 వరకు కూలీ ఇస్తున్నారు. ఎక్కువ కూలీ ఇచ్చినా కూలీలు దొరక్క పలు గ్రామాల్లో మిషన్ల ద్వారా పంట కోతలు కోయిస్తున్నారు. మిషన్‌లు ద్వారా కొంత ఉపయోగంగా ఉందని రైతులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది మార్కాపురం సబ్ డివిజన్‌లో సుమారు 30 వేల ఎకరాల్లో పలు రకాల పంటలు సాగు చేయగా కొనకనమిట్ల మండలంలో కంది మూడు వేల హెక్టార్లు, పత్తి 500 హెక్టార్లు, వరి 100 హెక్టార్లు, పెసర, పచ్చిరొట్ట పైర్లు 200 ఎకరాల్లో సాగు చేశారు. అలసంద, మినుము పంటలు సుమారు 5 వేల హెక్టార్లకు పైబడి సాగు చేశారు.

గిట్టుబాటు ధరలు ఇవ్వాలి

గతంలో కన్నా ఈ ఏడాది వ్యవసాయ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. అలసంద ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్ల వరకు, మినుము 3 నుంచి 4 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. అవి కూడా కొంతమేర దెబ్బతినటంతో తక్కువ ధరకు అడుగుతున్నారు. అలసందలు క్వింటా ధర ఇటీవల వరకు మంచివి రూ.4 వేలకు, కొంత డ్యామేజీ ఉన్నవి రూ. 3 వేల లోపు మార్కెట్ ఉండటంతో రైతులు పెట్టుబడులు కూడా రావని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ ధరలు బాగా ఉన్నా వ్యాపారులు కుమ్మక్కై ధరలు పెరగనివ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

సమాజ సేవకు ముందుండాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి

● మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి

మార్కాపురం టౌన్:సమాజసేవ చేసేందుకు ముందుండాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మానవత సంస్థ పట్టణ అధ్యక్షురాలు వనజాక్షి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజ సేవలో ముందున్న మానవతా సంస్థను అభినందించారు. ఆపదలో ఆదుకోవడం గొప్ప విషయమన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పి.సూర్యప్రకాష్‌రెడ్డి సంస్థకు లక్ష రూపాయల చెక్కు అందజేశారు. రోజూ అనాథలకు సేవలు అందిస్తున్న హోంగార్డు చెన్నుపల్లి కాశయ్యను సన్మానించారు. రెడ్‌క్రాస్ మార్కాపురం చైర్మన్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ, కనిగిరి మానవతా సంస్థ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, సంస్థ సభ్యులు పీవీ కృష్ణారావు, ఎన్.లావణ్య, ఆర్‌కేజీ నరసింహం, గుంటక సుబ్బారెడ్డి, హెచ్‌ఎం చంద్రశేఖరరెడ్డి, గుంటక చెన్నారెడ్డి పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చు



రక్తదాతలతో ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు, పక్కన వైఎస్సార్ సీపీ నాయకులు

● రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అన్నా రాంబాబు
● గిద్దలూరు నియోజకవర్గంలో ప్రతినెలా రక్తదాన శిబిరం

బేస్తవారిపేట: ప్రతి ఒక్కరూ కర్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రక్తదానంతో ఇతరుల జీవితాలు కాపాడవచ్చని, మీ రక్తం ఎందరికో జీవనాధారం అనే నినాదంతో నిరంతరం నియోజకవర్గంలో స్వచ్ఛంద రక్తదాన ఉద్యమం చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రక్తదానం చేసేందుకు పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో ముందుకు రావడం సంతోషదాయకమన్నారు. రక్తదానంతో పెద్దవాళ్లు బరువు తగ్గి ఆరోగ్యంగా ఉంటారని, రెగ్యులర్‌గా కర్తదానం చేయడంతో గుండె సంబంధిత వ్యాధులు తగ్గుతాయన్నారు. ఆపద సమయంలో మీరందించే రక్తం ప్రాణాలు కాపాడుతుందని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల సహకారంతో ప్రతినెలా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరినీ అభినందించి ఫ్రూట్స్, జ్యూస్ పంపిణీ చేశారు. ఎంపీపీలు వేగినాటి ఓసూరారెడ్డి, వెంకట్రావ్, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ కొండా రఘునాథరెడ్డి, మాజీ ఎంపీపీ పి.వెంకటరాజు, మండల ఉపాధ్యక్షులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు, జిల్లా బ్లడ్ డొనేషన్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, గిద్దలూరు బ్లడ్ స్టోరేజీ సిబ్బంది పాల్గొన్నారు.

మిరపలో బూడిద తెగులు నివారించాలి



రైతులకు సూచనలిస్తున్న ఏఓ

తాళ్లూరు: వాతావరణంలో తేమ మంచు అధికంగా ఉండటంతో మిరపలో బూడిద తెగులు ఆశిస్తోందని, నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు కోరారు. తెగులు సోకిన ఆకుల పైభాగం పసుపు రంగులోకి, అడుగు భాగం బూడిద రంగులోకి మారతాయని తెలిపారు. దీని వలన ఆకులు రాలి పోతాయని, కిరణజన్య సంయోగ ప్రక్రియ జరగక పెరుదల లోపంతో దిగుబడి తగ్గుతుందని చెప్పారు. నివారణకు నీటిలో కరిగే గంధం 80 శాతం, డబ్ల్యూపి 600 గ్రాములు లేదా కెరాథీన్ 60 మిలీ నీటిలో కలిపి పిచికారీ చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలు



స్వామివారి సేవకు హాజరైన భక్తులు

మార్కాపురం: గుండ్లకమ్మ నది ఒడ్డున ఉన్న పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ధ్వజారోహణ నిర్వహించారు. రాత్రి శేష వాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. ధ్వజారోహణ అనంతరం భేరిపూజ, భరిహారణం చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. పలువురు భక్తులు స్వామి వారికి పట్టు వస్త్రాలు, కానుకలు సమర్పించారు. అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ మాలకొండ నరసింహారావు, ఆర్‌కేజే నరసింహం, ఉటుకూరి రామకృష్ణ పాల్గొన్నారు.

మానవ సేవే ధ్యేయం

గిద్దలూరు రూరల్: మానవ సేవే ధ్యేయంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ముందుకు సాగిపోతోందని ఆ సంస్థ అధ్యక్షుడు గుల్లా రామకృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అందరికి సేవ చేయాలనే మంచి ఉద్దేశంతో మానవత సేవా సంస్థ ఆవిర్భవించినట్లు చెప్పారు. ఎన్నో సేవా కార్యక్రమాల ద్వారా తమ సంస్థ ప్రజల మెప్పు పొందుతోందన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.10 వేలు ప్రకటించారు. సంస్థ సభ్యులు ఎం.రాంభూపాల్‌రెడ్డి, యగటి రంగస్వామి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, నాయకులు

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సూచించారు. వైఎస్సార్ టీఎఫ్ క్యాలెండర్, డైరీని ఆయన ఆదివారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చారని, నాడు–నేడు ద్వారా పూర్తి స్థాయిలో పాఠశాలలు అభివృద్ధి చేస్తున్నారని, అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, జిల్లా అధ్యక్షుడు వి.వెంకట్రామిరెడ్డి, యూనియన్ నాయకులు గోసు సుబ్బారావు, పి.వెంకటప్పారెడ్డి, సీహెచ్ శ్రీనివాసులు, జింకా నరసింహారావు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలు విడనాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

గిద్దలూరు రూరల్: సమాజంలో పాతుకుపోయిన మూఢనమ్మకాలను విడనాడాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పిడతల రాంభూపాల్‌రెడ్డి కుమారుడు పిడతల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. జేవీవీ ఆధ్వర్యంలో పట్టణంలోని అభినాష్ ఫంక్షన్ హాల్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి శిక్షణ తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు. శాస్త్రీయమైన ఆలోచన విధానాలు మెరుగుపడేందుకు జన విజ్ఞాన వేదిక ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. మూఢనమ్మకాలతో ప్రజలు అయోమయస్థితిలో కొట్టుమిట్టాడుతున్న సమయంలో జేవీవీ వారిని ఆలోచింపజేసే కార్యక్రమాలు చేస్తోందన్నారు. జేవీవీ నాయకులు పి.స్వరూపారెడ్డి, డాక్టర్ కాలేషా, మండ్ల శ్రీను, యూటీఎఫ్ నాయకులు రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

గుంటి గంగకు ప్రత్యేక పూజలు



ముస్తాబైన అమ్మవారు



ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ అమ్మవారు

తాళ్లూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి గంగా భవాని అమ్మ వారికి ఆదివాకం ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పూజారులు విజయలక్ష్మి, ప్రకాశరావు ఆధ్వర్యంలో పూజలు చేశారు. అమ్మవారికి భక్తులు పది చీరలు బహూకరించారు. ఆలయానికి రూ.12.626 ఆదాయం వచ్చినట్లు ఆర్‌పీ శ్రీనివాసరావు తెలిపారు. సౌకర్యాలను ఆలయ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావు, ఈఓ భాస్కర్‌రెడ్డి, ఆలయ అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ముండ్లమూరు ఎస్‌ఐగా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన మల్లికార్జునరావు కుంటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని సందర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పోలేరమ్మ తల్లి చల్లంగా చూడాలని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పోలేరమ్మ భక్తుల కోర్కెలు తీర్చే తల్లిగా పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందింది. ఆలయ అర్చకులు వెంకటేశ్వర్లు అమ్మ వారికి ప్రత్యేక అలంకారాలు చేసి కుంకుమార్చన, అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ పరిధిలో ఉన్న నాగమయ్య పుట్టకు, నాగమయ్య శిలలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ బాసాని శ్రీనివాసులు, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి పర్యవేక్షించారు.

గ్రానైట్ లోడు లారీలు సీజ్



సీజ్ చేసిన లారీతో సీఐ సుబ్బారావు

కురిచేడు: బిల్లులు లేకుండా అక్రమంగా తరలిపోతున్న గ్రానైట్ లోడు లారీలను విజిలెన్స్ సీఐ బీవీ సుబ్బారావు హెడ్ ఆఫీస్ టీమ్‌తో కలిసి శనివారం రాత్రి సీజ్ చేసి కురిచేడు పోలీసులకు అప్పగించారు. సీఐ సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం..చీమకుర్తి నుంచి గుజరాత్, మహారాష్ట్రకు మూడు లారీల్లో గ్రానైట్ బయల్దేరి వెళ్తోంది. రోడ్లపై తనిఖీల్లో భాగంగా కురిచేడులో శనివారం అర్ధరాత్రి లారీలను తనిఖీ చేయగా బిల్లులు లేకుండా వెళ్తున్నట్లు గమనించి వాటిని సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. మైన్స్, ట్యాక్స్, ట్రాన్స్‌పోర్టు అధికారులకు సమాచారం అందించారు. జరిమానా వసూలు చేసిన తర్వాత లారీలను విడుదల చేస్తామని సీఐ సుబ్బారావు చెప్పారు. మైన్స్ ఏజీ సుధాకర్, డీసీటీఓ రామారావు, పీసీలు సురేష్, కృష్ణ పాల్గొన్నారు.

చేతివృత్తిదారుల సదస్సును జయప్రదం చేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న సంఘ నాయకులు

కొమరోలు: విజయవాడలో సోమవారం చేతివృత్తిదారుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలంటూ గొర్రెల, మేకల పెంపకందారుల సంఘ జిల్లా కార్యదర్శి తిరుపతిరావు కోరారు. మండలంలోని మొట్టుపల్లెలో చేతివృత్తిదారుల రాష్ట్ర సదస్సు కరపత్రాలను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. తిరుపతిరావు మాట్లాడుతూ చేతివృత్తిదారులకు రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించిన నిధులు వారి అభివృద్ధికి, సంక్షేమానికి ఖర్చు చేయాలని, సబ్సిడీతో కూడిన రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వృత్తిసంఘాల నాయకులు రామరాజు, పాండు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే కేపీ



మంత్రులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌లు పట్టణంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆదివారం రాగా వారిని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి స్థానిక జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో కలిసి సన్మానించారు. నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రులతో ఎమ్మెల్యే చర్చించారు. మంత్రులను కలిసిన వారిలో ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి షంషీర్ అలీబేగ్, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, పార్టీ నాయకులు సీహెచ్ శ్రీనివాసులు, ఉత్తమ్‌కుమార్, పిచ్చయ్య ఉన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయాలి



ప్రశ్నపత్రాలు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి

మార్కాపురం టౌన్: విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ పరీక్ష పత్రాలను ఆయన విడుదల చేశారు. అనంతరం మాక్ టెస్టు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిభ పరీక్షల్లో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటాలన్నారు. పోటీ పరీక్షల్లో పాల్గొంటే మనలో ఉన్న ప్రతిభ సామర్థ్యం బయటకు వస్తుందన్నారు. మొత్తం 290 మంది విద్యార్థులు హాజరైనట్లు హెచ్‌ఎం చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ఎన్నికైన వారికి జాతీయ స్థాయిలో నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12 వేలు ప్రభుత్వం ఇస్తుందన్నారు. పి.సూర్యప్రకాష్‌రెడ్డి, రఫీ, కోటి, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు ప్రకృతి ఉత్పత్తుల మేళా

తాళ్లూరు: ప్రకృతి సాగుతో పండించిన పలు రకాలు ఉత్పత్తులను రైతులు అమ్ముకునేందుకు వీలుగా స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం ఆవరణలో సోమవారం మేళా నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం నుంచి మేళ ఉంటుందని చెప్పారు. కొర్రలు, ఊదలు, సామలు, ఆరికలు, అండ్రు కొర్రలు, వేరుశనగ, బొప్పాయి, సబ్బులు, బెల్లం పొడి, తాటి కలకండ, మహాబీర విత్తనాలు, రాగిపూస, వరిగ పూస, నల్లనువ్వ ఉండలు, తాటి బెల్లం లడ్లు, చిక్కీలు, కొర్ర బూందీ, అరిశలు, కూరగాయలు, ఆకుకూరలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. వినియోగదారులు మేళా సందర్శించి అవసరమైన ప్రకృతి ఉత్పత్తులు కొనుగోలు చేసి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని ఏవో ప్రసాదరావు కోరారు